క్లుప్తంగా

సేంద్రియ సాగు విధానం మేలు

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గంట్యాడ: రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. మండలంలోని అడ్డతీగ గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు నవధాన్యాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల పంటలు విషతుల్యం అవుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మణ

గజపతినగరం రూరల్: రైతు శ్రేయస్సే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రంగుపురం సర్పంచ్ కర్రి లక్ష్మణ అన్నారు. గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలందించేందుకు ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. కొత్తవలస గ్రామంలో సర్పంచ్ కుసుమకుమారి ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది శైలజతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో మరుపల్లి ఆస్పత్రి వైద్యురాలు సుష్మ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 75 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

కుక్కల దాడిలో పశువులకు గాయాలు

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో కుక్కల దాడిలో 16 ఆవులకు గాయాలయ్యాయి. కళ్లాల్లో కట్టి ఉన్న పశువులపై కుక్కల గుంపు శుక్రవారం దాడి చేసి గాయపరిచినట్టు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ ఏడీ రమణాచలం గాయపడిన పశువులకు వైద్యం అందించారు. రాబీస్ వ్యాధి సోకకుండా టీకాలు వేసినట్లు తెలిపారు.

జేవీకే కిట్ల పంపిణీపై ఆరా..

జామి: మండలంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీపై రాష్ట్ర అకడమిక్ మోనిటరింగ్ అధికారి శైల కల్పన ఆరాతీశారు. శుక్రవారం కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాకానుక కిట్లు అందరికీ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని మండలంలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ఎంతమందికి జేవీకే కిట్లు పంపిణీ చేశారు తదితర వివరాలను ఎంఈఓలు జె.జయశ్రీ, కె.గంగరాజులను అడిగి తెలుసుకున్నారు.

సారా కేసులో మహిళకు రిమాండ్

కొత్తవలస: సారా అమ్ముతూ పట్టుబడిన మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై పి.నరేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని గొల్లపేటలో సారా తయారీ, అమ్మకం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ సీహెచ్ రాజేశ్వరి ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బందం కనక అనే మహిళ వద్ద లీటరు సారా లభ్యమైంది. సారాను స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

3న పీడీఎస్ బియ్యం వేలాం

గజపతినగరం: ఇటీవల వివిధ కేసుల్లో సీజ్‌చేసిన 233.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని జేసీ ఆదేశాల మేరకు ఈ నెల 3న గజపతినగరం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం వేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

శృంగవరపుకోట: బక్రీద్‌ను పురస్కరించుకుని ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు తెలుగు అధ్యాపకుడు రహీం షేక్‌లాల్ శుక్రవారం నోటుబుక్స్ పంపిణీ చేశారు. సుమారు రూ.5 వేలు విలువ చేసే పుస్తకాలను బాలికలకు అందజేశారు.

గిరిజనులపై ముఖ్యమంత్రికి ప్రత్యేక అభిమానం

• ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య
• డీకేపర్తి గిరిశిఖర గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: గిరిజనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గిరిశిఖర గ్రామాలైన డీకేపర్తి, అడ్డతీగలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఎమ్మెల్యే ఆరాతీశారు. ఈ సందర్భంగా పథకాలు సక్రమంగా అందుతున్నాయని, ప్రభుత్వ పనితీరు బాగుందని ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గిరిజనులంటే సీఎం జగన్‌కు ప్రత్యేక అభిమానమని, అందుకే గిరిజనుల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మైదాన ప్రాంత పిల్లలతో పాటు ఏజెన్సీ ప్రాంత పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో అమ్మఒడి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాడేరు, పార్వతీపురంలో వైద్య కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గిరిజనుల పట్ల అమితమైన ప్రేమ చూపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులంతా మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం చాలా గొప్పవిషయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, నాయకులు కరాసి ఈశ్వరరావు, సుగురు సత్తిబాబు, కోడెల ముత్యాలనాయుడు, రంభ సత్యారావు, జాగరపుం అప్పారావు, ఈదుబిల్లి రమేష్, చప్ప చిన్న పాల్గొన్నారు.

రూ.1.12 కోట్లతో తారురోడ్డు నిర్మాణం



సంకుపాలెం తారురోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని పీకే పాలవలస పంచాయతీ పరిధిలో బెవరపేట గ్రామానికి, కరకాం పంచాయతీ పరిధి సంకుపాలెం గ్రామాలకు రూ.1.12 కోట్లతో తారురోడ్డు వేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. ఈ రెండు గ్రామాలకు ఇటీవల నిర్మించిన రోడ్లను శుక్రవారం వారు పరిశీలించారు. రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరడంతో ఆ విషయాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు వెంటనే స్పందించి బెవరపేట రోడ్డుకు రూ.80 లక్షలు, సంకుపాలెం రోడ్డుకు రూ.32 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలు తీరాయన్నారు. వారితో పాటు పార్టీ నాయకులు పతివాడ రాజారావు, బైరెడ్డి లక్ష్మణ, గెరిడి రామదాసు, అప్పలనాయుడు, బెవర కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పనులు చేపట్టొద్దు

• డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి



మాట్లాడుతున్న ఉపాధిహామీ పీడీ ఉమాపరమేశ్వరి

గజపతినగరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేస్తున్న పనుల్లో భాగంగా ఒక చోట చేపట్టిన పనిని పూర్తిచేసి మరో పనిలోకి వెళ్లాలని డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి సూచించారు. పాత మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై శుక్రవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో 01.04.2022 నుంచి 31.03.2023 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఎం.గుమడాం, మదుపాడ గ్రామాల రికార్డులు తప్పులతడకగా ఉన్నాయని, వాటిని సరిచేసుకోవాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, అంబుడ్స్‌మెన్ అన్నపూర్ణాదేవి, ఏపీడీ శారదాదేవి, డీవీఓ రవీంద్ర, క్లస్టర్ ఏపీడీ జానర్దనరావు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏపీఓ సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ



పాతనేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీధర్

గజపతినగరం: గతంలో వివిధ నేరాలకు పాల్పడి రౌడీషీటర్లుగా పోలీసుల రికార్డుల్లో నమోదైన వారంతా సత్ప్రవర్తన కలిగి ఉండాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ సూచించారు. గజపతినగరం సర్కిల్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. సత్ప్రవర్తనతో మెలగకున్నా, మళ్లీ తప్పుడు పనులు చేసినా, నేరాలకు పాల్పడినట్లయితే వారిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని, నైతిక విలువలు పెంపొందించుకొని మంచి పౌరులుగా మారినట్లయితే వారి పేర్లను రౌడీషీట్ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట గజపతినగరం, ఆండ్ర ఎస్సైలు గంగరాజు, సిద్దార్థ ఉన్నారు.

అక్టోబర్ 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ సుదర్శన్ దొర

జామి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణపై చర్చించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ దొర మాట్లాడుతూ.. అక్టోబర్ 17 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రారంభమవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, ఫొటోలు, అడ్రస్‌లు తదితర వివరాలు పరిశీలించి మార్పులు చేయనున్నట్లు చెప్పారు.
జూలై 21 నుంచి ఆగష్టు 22 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపడతారని వివరించారు. రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, హెచ్‌డీటీ సునీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, టీడీపీ నేత బండారు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ నిరసన



ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

గజపతినగరం: పెరిగిన విద్యుత్ చార్జీలతో సామాన్య ప్రజలు ఆర్థికంగా సతమతమవుతున్నారని, పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ, వామపక్ష నేతలతో కలిసి శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంతో పాటు పలు ప్రభుత్వ రంగాలను ప్రైవేటు పరం చేసి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు చూస్తోందని, అటువంటి చర్యలను వెంటనే మానుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామునాయుడు, కె.రాము, కృష్ణ, లక్ష్మి, రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

• జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర

కొత్తవలస: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బడిఈడు పిల్లలు బడిలో చేర్పించాలని మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై విద్యార్థులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక కోర్టు నుంచి కొత్తవలస మూడురోడ్ల కూడలి వరకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలు, హోటల్స్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాలలతో పనిచేయిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎస్.బాలసూర్యారావు, న్యాయవాదులు ఎం.వి.గిరిబాబు, జి.శ్రీనివాసరావు, నందిపల్లి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతికి ప్రజాభిప్రాయ సేకరణ

వేపాడ: మండలంలో వీలుపర్తి పంచాయతీ పెదదుంగాడ సమీపంలో కొలికిపాలెంలో క్వారీ, క్రషర్ ఏర్పాటుపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బీబీ శారిత ఆధ్వర్యంలో డీఆర్వో గణపతిరావు సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పెదదుంగాడ గ్రామంలో సర్వే నెం.7లో 7.60 హెక్టార్లలో రోడ్ మెటల్ అండ్ బిల్డింగ్ స్టోన్ (మెసర్స్ వజ్రకాయ క్రషర్స్ ప్రైవేట్ లిమిటెడ్) ఏర్పాటుపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని డీఆర్వో కోరారు. వీలుపర్తి నుంచి వావిలపాడు వెళ్లే జంక్షన్ మీదుగా కొలికిపాలెం వరకు రోడ్డు అభివృద్ధి చేయాలని, స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, రోడ్డుపై దుమ్ము, ధూళి ఎగరకుండా ప్రతిరోజు తడపాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వీలుపర్తి, వెల్దాం, చినదుంగాడ, పెదదుంగాడ గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా క్వారీ, క్రషర్లు నిర్వహించినట్లయితే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, డీటీ సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రషర్‌కు వెళ్లే లారీలు నిలిపివేత

వేపాడ: వావిలపాడు పంచాయతీలో ఉన్న క్రషర్ యజమానులు రోడ్డు తడపకపోవటంతో దుమ్ము, ధూళి ఎగసిపడి మామిడితోటలపై పడి పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. క్రషర్‌కు వెళ్లే వాహనాలను శుక్రవారం అడ్డుకున్నారు. దుమ్ము, ధూళి కారణంగా పంటలు పాడవుతున్నాయని, దుమ్ము ఎగరకుండా రోడ్డు తడపాలని క్రషర్ యజమానులకు ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రోడ్డుకు అడ్డంగా ట్రాక్టరును నిలిపి లారీల రాకపోకలను అడ్డుకున్నారు.

సంక్షిప్తంగా...

పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ

గజపతినగరం: పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్‌చేశారు. ఈ మేరకు గజపతినగరంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 12 నెలలుగా పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని, దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. కార్మికులకు రూ.10 వేలు వేతనాన్ని చెల్లించాలని, కనీస వేతనం అమలు చేస్తూ పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్సై, పెన్షన్‌ను అమలు చేయాలని కోరారు.

నగదు పురస్కారం అందజేత



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో ఉంటూ ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు జిల్లా సంక్షేమశాఖ అధికారులు శుక్రవారం నగదు పురస్కారాలు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన గొల్లూరు లావణ్య(482)కు రూ.వెయ్యి నగదు, డి.మీనాక్షి(465)కి రూ.500లు నగదు బహుమతిని ఏఎస్‌డబ్ల్యూఓ బి.రామానందం, హెచ్‌డబ్ల్యూఓ విజయ నిర్మల అందచేశారు. ఉన్నత విద్యలో కూడా ఇదేవిధంగా రాణించాలని విద్యార్థినులకు సూచించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీ



పోటీలో పరుగుతీస్తున్న ఎడ్లు

వేపాడ: వావిలపాడు గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 19 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ఇందులో కె.జె.పురానికి చెందిన కొయిలాడ మోహనరావు, లెక్కలవానిపాలెంకు చెందిన పైడితల్లమ్మ, ఎం.కోటపాడుకు చెందన పి.శ్రీనుకు చెందిన ఎడ్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి

జామి: మండలంలో కుమరాం కేజీబీవీని కేజీబీవీల రాష్ట్ర కార్యదర్శి గీత శుక్రవారం సందర్శించారు. 6వ తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థినులతో మాట్లాడారు. కేజీబీవీలో సీటు దొరకడం అదృష్టమని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థినులకు సూచించారు. ఎవరూ కూడా మధ్యలో చదువు మానేసి వెళ్లకూడదన్నారు. పాఠశాలలో విద్యాప్రగతి, సిబ్బంది పనితీరు, పాఠశాల పరిసరాలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆమె వెంట పాఠశాల ప్రత్యేకాధికారి బి.జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీ..

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులలో ఖాళాగా ఉన్న సీట్లలో, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

3న ప్రవేశ పరీక్ష

కొత్తవలస: అర్ధన్నపాలెం సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతులలో మిగులు సీట్ల భర్తీకి జూలై 3న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జామి: మండల కేంద్రమైన జామిలో ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ ఏడీ నాగభూషణరావు, ఏఓ కిరణ్‌కుమార్, ఎస్సై వీరబాబు బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయించినా, కల్తీ విత్తనాలు రైతులకు అంటగట్టినా సంబంధిత దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.